

మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## దీక్షా దివస్‌ను సక్సెస్ చేయాలి

ఎదులాపురం, నవంబర్ 27 : ఈనెల 29వ తేదీన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకంతోపాటు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, అష్రాఫ్, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, సలీం, జాహుర్, ఇజ్జగిరి అశోక్, స్వరూప, మమత, కరుణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానించిన గ్రామస్తులు

## ప్రజలను ప్రాణంగా చూసుకుంటా..

- ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- పీచర, నాగమల్యాల్, లక్ష్మీపూర్ గ్రామాల్లో పర్యటన

నేరడిగొండ, నవంబర్ 27 : బోథ్ నియోజకవర్గ ప్రజలను ప్రాణంగా చూసుకుంటానని, వారికి ఏ కష్టం వచ్చినా నా కష్టంగా భావిస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం పీచర, లక్ష్మీపూర్, నాగమల్యాల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తప్పకుండా పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యేగా గెలిచానని గుర్తుచేశారు. గ్రామాల్లో రచ్చబండ వద్ద గ్రామస్తులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే గ్రామాల్లో పర్యటిస్తున్నానని వెల్లడించారు. రెండు రోజుల క్రితం గ్రామస్తుల కోరిక మేరకు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భీముడు, తులసీరాం, నాయకులు రాథోడ్ సురేందర్, పాండు, జాదవ్ సంతోష్, విలాస్ పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

## హామీని సీఎం నెరవేర్చాలి

- కేజీబీవీ ఉపాధ్యాయుల నిరసన

నిర్మల్ అర్బన్, నవంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కేజీబీవీలలో బుధవారం భోజన సమయంలో ఉపాధ్యాయులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీపై ప్రభుత్వానికి నివేదిక

### పనులు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశాలు

నిర్మల్ అర్బన్, నవంబర్ 27 : దిలావర్‌పూర్ మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా రైతులు ధర్నా చేస్తున్నారు. రైతులు, గ్రామస్తులు ఆందోళ చేస్తుండంతో వారి ఇబ్బందులను తెలుసుకునేందుకు వెళ్లిన ఆర్డీవో రత్న కల్యాణిని అడ్డుకుని వాహనాన్ని ధ్వంసం చేసిన విషయం విదితమే. దీంతో బుధవారం గ్రామస్తులతో కలెక్టర్ అభిలాష అభినవ్ చర్చలు జరిపారు. ఈ ఘటనలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె చెప్పారు. ఫ్యాక్టరీ పనులు నిలిపి వేయాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. ప్రజలెవరూ అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు. అసత్య వార్తలు, పుకార్లు ప్రచారం చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మండల వాసులు



పోలీసులపై రాళ్లు రువ్వడంతో వాహనాలతో వెనుతిరిగి పోతున్న పోలీసులు

# రెండో రోజూ ఉద్రిక్తం

### ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ధర్నా చేసిన రైతుల అరెస్ట్

- ఉదయం రెండు గ్రామాల్లోకి భారీగా వచ్చిన పోలీస్ బలగాలు
- వాహనాలను అడ్డుకున్న మహిళా రైతులు
- దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా
- కలెక్టర్ హామీతో నిరసన విరమణ

దిలావర్‌పూర్, నవంబర్ 27 : పచ్చని పొలాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను తరలించాలని కోరుతూ రెండో రోజైన బుధవారం అన్నదాతలు తిరగబడ్డారు. 'మా పిల్లల భవిష్యత్ కోసం చావనైనా చస్తాం.. పరిశ్రమను మాత్రం గ్రామ పరిసరాల్లో నిర్మించనివ్వమని దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లీ, సముందర్‌పల్లీ, కాండ్లీ, దిలావర్‌పూర్ గ్రామాల ప్రజలు నిర్మల్-భైంసా 61వ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలోనే నిన్న మంగళవారం ధర్నా చేసిన రైతులను అరెస్టు చేసేందుకు భారీగా పోలీస్ బలగాలతో గ్రామాల్లోకి వెళ్లారు. అప్పటికే కొంత మంది రైతులను అరెస్టు చేసి తీసుకెళ్లారన్న విషయం గమనించిన రైతులు, మహిళలు గ్రామం నుంచి భారీ ర్యాలీగా దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో రైతులు, ప్రజలు పోలీస్ స్టేషన్ లోపలికి రాకుండా తాళం వేశారు. అదే ఆవరణలో ఎంఆర్వో, ఎంపీడీవో, ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో ఎవరిని అనుమతించలేదు. గుండంపల్లీ గ్రామంలో అరెస్ట్ చేసేందుకు వచ్చిన ప్రత్యేక బలగాలను, నిర్మల్ డీఎస్పీ వాహనాన్ని అడ్డుకున్నారు. అక్కడి నుంచి పాదయాత్రగా దిలావర్‌పూర్‌కు వచ్చిన రైతులు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి చేతుల్లో మందు డబ్బాలు పట్టుకుని ధర్నాకు దిగారు. పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్పీ జాతీయ రహదారిపైకి రైతులను రానివ్వ



దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద రైతును రోడ్డుపైకి రాకుండా ఉన్నపోలీసు బలగాలు

కుండా ఉండేందుకు బలగాలను మోహరించారు. పోలీస్ బలగాల దగ్గరకు రైతులు దూసుకొస్తున్న విషయాన్ని గమనించిన పోలీసులు బాష్పవాయువును ప్రయోగించేందుకు ప్రయత్నించగా రైతులు పోలీసులపై తిరగబడ్డారు.

### పోలీసులను రాళ్లతో పరుగులు పెట్టించిన రైతులు

భారీగా తరలివచ్చిన ప్రత్యేక పోలీస్ బలగాలపై రైతులు రాళ్లు, కారంపొడితో కిలోమీటరు మేరకు పోలీసులను తరిమికొట్టారు. తమ ప్రాణాలను తీసే పరిశ్రమ వద్దని ధర్నాలు చేస్తే మీరు మాపై కేసులు పెట్టి నిర్బంధిస్తారా? అని పోలీస్ వెంట పడి రాళ్లతో కొట్టారు. రాళ్లదాడిలో పోలీసుల వాహనాలు ధ్వంసం అయ్యాయి. దీంతో పోలీసులు ఏం చేయలేని పరిస్థితుల్లో అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్లిపోయారు. అనంతరం రైతులు జాతీయ రహదారిపై బైఠాయించారు. ఉదయం 11 గంటలకు రోడ్డుపై కూర్చున్న రైతులు సాయంత్రం వరకు అలాగే కూర్చున్నారు. దీంతో నిర్మల్ భైంసా 61వ జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచి పోయాయి. దాదాపు 5 గంటలపాటు జాతీయ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం ఇంట్లో నుంచి నిర్బంధంగా అరెస్ట్ చేసి తీసుకెళ్లిన రైతులను వెంటనే విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమను తరలిస్తేనే జాతీయ రహదారి నుంచి వెళ్లిపోతామని అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని రైతులు, మహిళలు రోడ్డుపై బైఠాయించారు. దాదాపు నాలుగు గంటల ప్రాంతంలో కలెక్టర్ రైతు జేఏసీ తరపున కొందరు కలెక్టరేట్‌కు రావాలని కోరడంతో 20 మంది గ్రామ ప్రతినిధులు చర్చలకు వెళ్లారు. ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను నిలిపివేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చిన విషయాన్ని జేఏసీ ప్రతినిధులు రైతులకు విన్నవించారు. ఉదయం అరెస్ట్ చేసి తీసుకువెళ్లిన రైతులను పోలీసులు వదిలిపెట్టారు. అనంతరం ధర్నాను విరమించి అప్పుడే అక్కడికి వచ్చిన నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిలను తీసుకుని దిలావర్‌పూర్ గ్రామం దాకా ర్యాలీగా తీసుకువెళ్లారు.

### సంయమనం పాటిస్తే సమస్య పరిష్కారం

- ఎస్పీ జానకి షర్మిల

రైతులు ప్రజలు సంయమనం పాటిస్తే ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ప్రజలకు అనుకూలంగా ఆదేశాలు జారీ చేయడం అభినందనీమన్నారు. గ్రామాల ప్రతినిధులతో చర్చల అనంతరం దిలావర్‌పూర్ వచ్చిన ఆమె బుధవారం మాట్లాడుతూ.. పోలీసులు పూర్తి సంయమనంతో వ్యవహరించారని, ఎక్కడ కూడా రైతులపై దాడి చేయలేదన్నారు. నిన్న జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని పరిస్థితులు చేజారిపోకుండా ఉండేందుకు కొంతమంది రైతులను అదుపులోనికి తీసుకున్నామన్నారు. పోలీస్‌లపై రైతులు రాళ్లు రువ్వినప్పటికీ తాము లాఠీఛార్జి చేయకుండా, సంయమనంతో శాంతియుతంగానే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు సంయమనం పాటించి శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. దిలావర్‌పూర్ గ్రామంలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో దిలావర్‌పూర్ మండలవాసులు



దిలావర్‌పూర్‌లో రైతులతో కలిసి మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల



# దీక్షా దివస్‌కు సన్నద్ధం

- ఉమ్మడి జిల్లా శ్రేణులను సమన్వయం చేసేలా సన్నాహక సమావేశాలు
- 2009 నవంబర్ 29 ఉద్యమ స్ఫూర్తి గుర్తుకువచ్చేలా దీక్షా దివస్

మంచిర్యాల, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2009 నవంబర్ 29న బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ చేపట్టిన దీక్ష మళ్లీ గుర్తుకువచ్చేలా ఈ నెల 29న దీక్షా దివస్‌ను బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లా కేంద్రాల్లో ఈ దీక్షా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించనుండగా, బీఆర్ఎస్ శ్రేణులతో పాటు తెలంగాణ ఉద్యమ కారులను సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలను నిర్వహించారు. 2009 నవంబర్ 29 గుర్తుకు వచ్చేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుండగా, తెలంగాణలో అసమర్థ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఎండగట్టేందుకు ఈ వేదిక నుంచే బీఆర్ఎస్ శంఖారావాన్ని పూరించనుంది. కేసీఆర్ దీక్షా దివస్‌తో 2009లో ఆంధ్రా పాలకులపై సమర శంఖం పూరించగా, ప్రస్తుతం చేపట్టబోయే దీక్షా దివస్ ద్వారా అసమర్థ పాలన సాగిస్తున్న కాంగ్రెస్‌పై శంఖారావం పూరించనున్నారు. దీక్షా దివస్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశనం చేసి ఒక్కో జిల్లాకు ఒక్కో ఇన్‌చార్జిని సైతం నియమించారు.

### ఉద్యమ స్ఫూర్తి రగిలించేలా దీక్షా దివస్

ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యమ స్ఫూర్తి రగిలించేలా నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ముఖ్య నేతల ఆధ్వర్యంలో ఈ దీక్షా దివస్ కార్యక్రమం జరగనుండగా, అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ఈ దీక్షా దివస్‌కు తరలివచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసేలా నిర్వహించనున్న ఈ రోజు నుంచే కాంగ్రెస్ పాలనను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఈ దివస్‌ను బీఆర్ఎస్ వేదిక చేసుకోనున్నది. కేసీఆర్ కలలుగన్న తెలంగాణ కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎంత వెనుకబాటుకు గురైందో ఈ వేదికపై వివరించనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎండగట్టి ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఈ వేదిక ద్వారా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగనుంది.

### ఇన్‌చార్జిల నియామకం

తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఉద్యమ నాయకుడు కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్‌ను మననం చేసుకునేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. ఆదిలాబాద్ జిల్లాకు మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మంచిర్యాల జిల్లాకు తుల ఉమ, మాజీ జడ్పీ చైర్మన్, ఆసిఫాబాద్ జిల్లాకు మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావ్, నిర్మల్ జిల్లాకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి దీక్షా దివస్‌లకు ఇన్‌చార్జిలుగా ఉండనున్నారు.



# వామ్మో..చలి

- సిర్పూర్(యూ)లో 7.9 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
- రాష్ట్రంలోనే అత్యల్పంగా నమోదు
- గజ గజ వణుకుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు

సిర్పూర్(యూ), నవంబర్ 27: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలను వారం రోజులుగా చలి గజ గజ వణికిస్తున్నది. బుధవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా సిర్పూర్ (యూ) మండలంలో 7.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో గత వారం రోజులుగా ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతున్నది. బుధవారం 7.9 డిగ్రీలకు పడిపోవడంతో పాటు చల్లని గాలులు వీస్తుండడంతో ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా దుప్పట్లు కప్పుకొని పనులకు వెళ్లే పరిస్థితి నెలకొన్నది. మారుమూల గిరి పల్లెల్లో సాయంత్రం 5 గంటలకే వాకిళ్లలో నెగడి వద్ద మంట కాగుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రానున్న రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పడి పోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



సిర్పూర్(యూ)లో మంట కాగుతున్న మహిళలు, చిన్నారులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## నాణ్యమైన భోజనం అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- కేజీబీవీ పాఠశాల తనిఖీ

నేరడిగొండ, నవంబర్ 27 : సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం,అల్పాహారం నాణ్యమైనవి అందించాలని అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం నేరడిగొండలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్టోర్ రూంలో నిల్వ ఉన్న సన్న బియ్యం, ఇతర సరకుల నాణ్యత, వాటి కాల పరిమితిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ఎలా ఉందని అడిగారు. ఇంకా ఏమైన సమస్యలున్నాయా అని విద్యార్థులను ఆరా తీశారు. ఆయన వెంట ఎస్‌వో రజిత ఉన్నారు.

### నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

సమగ్ర కులగణన వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం నేరడిగొండలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కొనసాగుతున్న నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 1వ తేదీలోగా నమోదును పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కలీం, ఎంపీడీవో రజ్వీర్ ఉన్నారు.